క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. నగరానికి చెందిన శేషగిరిరావు మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమాన్ని ఏఈవో జగన్మోహనాచార్యులు పర్యవేక్షించారు. సాయంత్రం శ్రీవారి భక్తులు ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

కేజీబీవీ విద్యార్థినులకు బూట్ల వితరణ



విద్యార్థినులకు బూట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆనందపురం: స్థానిక నేళ్తేరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 20 మంది విద్యార్థినులకు శనివారం వైజాగ్ వలంటీర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్పోర్ట్స్ షూస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా సాయం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ వస్తువుల తయారీలో శిక్షణ అందించారు. కార్యక్రమంలో సంస్థ ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కలేషా బేగం, విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున వైద్యుడు

ఆనందపురం: మండలంలోని వేములవలసలో నవేద హెర్బల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వంద మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది రూపాయలు ఖర్చయ్యే వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్యులు నవీన్‌కుమార్, ప్రియా, కల్యాణి సేవలు అందించగా వలంటీర్ కోరాడ శ్రీను సహకారం అందించారు.

దోమల కట్టడికి ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: జీవీఎంసీ మూడో వార్డులో శనివారం మలేరియా ఇన్‌స్పెక్టర్ సూరిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది దోమల నిర్మూలనకు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు వృద్ధి చెందకుండా అన్ని ప్రాంతాల్లోను ఫాగింగ్ చేయిస్తున్నామని తెలిపారు. కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ జరిపిస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని, అలా చేస్తే దోమలు రావని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం



మూలకుద్దు కేథరిన్ విద్యా సంస్థల సమీపంలో కాజ్‌వేపై కానరాని రెయిలింగ్



ఉప్పగెడ్డల వద్ద ఇరుకైన కాజ్‌వేకు ఇరువైపులా శిథిలమైన రెయిలింగ్

- కాజ్‌వేలపై రెయిలింగ్ శిథిలం
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
- రెయిలింగ్ నిర్మాణం, సిగ్నల్స్ ఏర్పాటుకు గ్రామస్తుల వినతి

తగరపువలస: వర్షా కాలం వచ్చిందంటే భీమిలి డివిజన్ గోస్తనీ నదీ తీర గ్రామ ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతుంటారు. ముఖ్యంగా నదికి వరదలు పోటెత్తినప్పుడు గెడ్డలు, కాలువలు, వ్యవసాయ భూముల ద్వారా నీరు ప్రవహించి పల్లపు ప్రదేశాల్లోని గ్రామాలను చుట్టుముడుతుంటాయి. అలాంటి గ్రామాలు ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో పదుల సంఖ్యలో ఉన్నాయి. చాలా వరకు గ్రామాలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయి. అయినప్పటికీ ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తరచూ కోరుతుంటారు. వాటిలో తుపాను రక్షిత భవనాలు, గ్రామాలకు చేరుకునే కాజ్‌వేలు ముఖ్యమైనవి. భీమిలి మండలంలోని కొత్త మూలకుద్దు గ్రామానికి కూడా తగరపువలస–భీమిలి రోడ్డు నుంచి ఉప్పుగెడ్డ రోడ్డులోకి ప్రవేశించేటప్పుడు మార్గం మధ్యలో మూడు చోట్ల కాజ్‌వేలు ఉన్నాయి. గతంలో వీటికి ఇరువైపులా రక్షణగా రెయిలింగ్‌లు ఉండేవి. కాలక్రమేణా అవి శిథిలం కావడంతో చీకటిపడిన తరువాత వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై రెయిలింగ్ నిర్మాణంతోపాటు సిగ్నల్స్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

రక్షణ చర్యలు అవసరం

ఏడాది కిందట భీమిలి రోడ్డు నుంచి కొత్త మూలకుద్దు వరకు సుమారు 2 కిలో మీటర్ల పొడవునా ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.25 లక్షలతో బీటీ రోడ్డు మరమ్మతులు, నిర్మాణం చేపట్టారు. ఐదేళ్ల పాటు ఈ రహదారి నిర్వహణ పనులతోపాటు కాజ్‌వేలపై రక్షణ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా.. కాంట్రాక్టర్ వీటిని పట్టించుకోలేదు. ఈ రెండు కిలోమీటర్ల పొడవునా ఒక్క గ్రామం తప్ప మిగిలినదంతా వ్యవసాయ భూములే. అందువల్ల విద్యుత్ స్తంభాలు కూడా తక్కువగా ఉంటాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాల తోపాటు రెగ్యులర్‌గా స్కూల్ బస్‌లు కొత్త మూలకుద్దు వస్తుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని వరదల నుంచి బయట పడటానికి ఉపయోగపడుతున్న కాజ్‌వేలకు ఇరువైపులా రక్షణగా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కొత్త మూలకుద్దు వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పర్యటన



మహిళా రైతులను సాగు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిటీ చైర్‌పర్సన్ కనిమొళి



రెడ్డిపల్లిలో ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడుతున్న పార్లమెంటరీ కమిటీ సభ్యులు

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ విభాగాల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ శనివారం ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పర్యటించింది. శొంఠ్యాం, చందక పంచాయతీ జగ్గరాజుపాలెంతో పాటు రెడ్డిపల్లిలోని సచివాలయాన్ని స్టాండింగ్ కమిటీ సభ్యులు సందర్శించారు. ఆయా గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. - ఆనందపురం/పద్మనాభం

212మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస: సంతోపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన 212 మంది విద్యార్థులకు శనివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొహసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ తరపున విశాఖ ఐ హాస్పిటల్ ట్రస్ట్, సత్యసాయి సేవా సంస్థలు సంయుక్తంగా ఈ పరీక్షలు నిర్వహించాయి. విద్యార్థుల్లో 14 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. మెరుగైన కంటి చూపు కోసం తీసుకోవలసిన ఆహారం, జాగ్రత్తలు గురించి వైద్య సిబ్బంది విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ సీహెచ్.వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు వై.ఎస్.వి.వి.పి.డి జగన్నాధస్వామి, సత్యసాయి సేవాసంస్థల జోనల్ కో–ఆర్డినేటర్ ఎం.వి.సత్యసాయికుమార్, ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ టి.వి.ఆర్.బాబా, సీనియర్ సేవాదళ్ సీహెచ్. వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే



శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం సందర్శించారు. శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా శ్రీవారి అంతరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు టీటీడీ అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం, ప్రసాదం అందజేశారు.

‘ఈ–క్రాప్’తో రైతులకు మేలు



పాండ్రంగిలో ఈ క్రాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి

పద్మనాభం: ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు పంట నష్టం జరిగితే ఇన్సూరెన్సు వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి తెలిపారు. మండలంలోని పాండ్రంగిలో చేస్తున్న ఈ–క్రాప్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం అమ్మాలంటే ఈ–క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి మోహనరావు, ఏఈవో శ్రీనివాసరావు, చక్రవర్తి, జైరామ్, వెంకటరమణ పాల్గొన్నారు.

అష్టలక్ష్మి సన్నిధిలో ‘హలో బేబి’ షూటింగ్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో నటీనటులు

కొమ్మాది: ఎస్‌కేఎంఎల్ పిక్చర్స్ పతాకంపై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మిస్తున్న హలో బేబి సినిమా ప్రారంభోత్సవం కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి సన్నిధిలో శనివారం జరిగింది. ఈ సినిమా ద్వారా రామ్ గోపాల్ రత్నం దర్శకుడిగా, హీరోయిన్ అరోరా శ్రీ పరిచయమవుతున్నారు. ఇది హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రమని నిర్మాత తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఏఐకు డిమాండ్



డా. కె. శ్రీనివాస్ భాస్కర్‌ను సత్కరిస్తున్న గీతం యాజమాన్యం

కొమ్మాది: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కృత్రిమ మేధకు సంబంధించిన అంశాలపై లోతైన పరిజ్ఞానం ఉన్న వారికి భవిష్యత్తులో డిమాండ్ ఏర్పడుతుందని ఐఐటీ భువనేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె. శ్రీనివాస్ భాస్కర్ అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్స్ (ఐఈఈఈ) పవర్ ఇంజినీర్స్ సొసైటీ విద్యార్థి విభాగం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో వారి కంటే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు ఉన్న వారు ఎక్కువ అవకాశాలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె. నాగేంద్ర ప్రసాద్, డా. జేవి సెవెస్త్రైన్ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం జీఈఆర్ సాధించాలి

- సచివాలయ ఎడ్యుకేషన్ కార్యదర్శులకు డీఈవో చంద్రకళ ఆదేశం



బోరవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్–స్థూల ప్రవేశాల నిష్పత్తి) సర్వే 100 శాతం జరపాలని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. జీవీఎంసీ జోన్–2 పరిధి బోరవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, జీఎస్‌వో లేఅవుట్, మారికవలస, వాంబే కాలనీ తదితర సచివాలయాలను ఆమె శనివారం సందర్శించి, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో జీఈఆర్ 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం బోరవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ పాఠశాల పరిస్థితి, గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పూర్తయిన సిలబస్ తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలకరించారు. వారి వర్క్‌బుక్స్ పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

గెడ్డలో పడి వ్యక్తి మృతి



గెడ్డలో దాకమర్రి జగ్గారావు మృతదేహం

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని ఒక వ్యక్తి గెడ్డలో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. మధురవాడ వాంబే కాలనీలో దాకమర్రి జగ్గారావు(45), అతడి భార్య, ఇద్దరు పిల్లలు నివసిస్తున్నారు. జగ్గారావు మతిస్థిమితం లేక కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. అక్కయ్యపాలెం సాయిబాబా గుడి వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో అదే ప్రాంతంలోని వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా ఉన్న గెడ్డలోకి మల విసర్జనకు దిగాడు. గెడ్డలో పడి జగ్గారావు మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. జగ్గారావు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు తెలియజేశారు. సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మదర్ థెరిసా జీవితం ఆదర్శనీయం



సన్మానం అందుకున్న సంఘ సేవకులు



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బంగ్లామెట్ట ఉపాధ్యాయులు, విద్యార్థులు



భీమిలిలో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎంసీఏ అధ్యక్షుడు సుధాకర్, వాకర్స్

ఆనందపురం: సంఘ సేవకురాలు మదర్ థెరిసా జీవితం అందరికీ ఆదర్శనీయమని ఉత్తరాంధ్ర జోన్ గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. మండలంలోని వెల్లంకిలో శనివారం మదర్ థెరిసా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థెరిసాను ఆదర్శంగా తీసుకొని వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. సమాజంలో వివిధ రకాలుగా సేవలు అందిస్తున్న శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆదర్శగ్రామం గొట్టిపల్లి కో–ఆర్డినేటర్ డబ్బీరు విజయ్‌కుమార్, సంఘ సేవకుడు కొట్యాడ సత్యమూర్తి, గ్రామీణ వైద్యుడు బొచ్చు శ్రీనివాసరావుతోపాటు పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన లంక మధుప్రియను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగరాజు, ఏయూ ప్రొఫెసర్ జాన్ స్టీఫెన్, డీటీ శ్రీనివాసరావు, గ్రామీణ వైద్యుల సంఘం గౌరవ అధ్యక్షుడు ముమ్మన తిరుపతిరావు, ప్రతినిధులు కడగళ్ల నారాయణ, కనకారావు, రామ కోటేశ్వరరావు, పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాతకు ఘన నివాళి

తగరపువలస: మదర్ థెరిసా తన సేవల ద్వారా విశ్వమాతగా ప్రసిద్ధి చెందారని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్.అప్పలరాజు అన్నారు. థెరిసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ భారతదేశ పౌరసత్వం పొందిన ఆమె 1950లో కోల్‌కతాలో మిషనరీస్ ఆఫ్ ఛారిటీని ప్రారంభించి 45 ఏళ్ల సేవలు అందించారన్నారు. ఇతర దేశాలకు మార్గదర్శకంగా ఉంటూ పేదలు, రోగులు, అనాథలు, మరణశయ్యపై ఉన్న వారికి పరిచర్యలు చేశారన్నారు. 2010 ఆగస్టులో మదర్ థెరిసా శత జయంత్యుత్సవాల సందర్భంగా భారతీయ రైల్వే మదర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిందన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ దాతృత్వ దినంగా పాటించనున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయురాలు పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం

భీమునిపట్నం: మదర్‌థెరిసా సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఇతరులకు మన వంతు సాయం అందించాలని వైఎంసీఏ అధ్యక్షుడు కె.ఎస్.ఎం.సుధాకర్ అన్నారు. మదర్‌థెరిసా జయంతి సందర్భంగా భీమిలి బీచ్ దరి మదర్ థెరిసా పార్కులోని ఆమె విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు, నిర్భాగ్యులకు మదర్ థెరిసా అందించిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట



ఉత్సవాలకు రాట వేస్తున్న మహిళలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో శనివారం స్థానికులు వినాయకచవితి ఉత్సవాలకు రాట వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్లా వంశీరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, నమ్మి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉత్సవాలకు తమ వంతు సాయం అందిస్తామన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం రేపు

ఆనందపురం: దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించడానికి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 28న గుర్తింపు శిబిరం నిర్వహించనున్నామని ఎంపీడీవో అడపా లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ సహకారంతో అలిమ్‌కో సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉపకరణాలు అందించడానికి నిర్ణయించిందని చెప్పారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాలు సైకిళ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, అంధుల చేతికర్ర, కృత్రిమ అవయవాలు, వివిధ రకాల ఉపకరణాలు అందజేయడం కోసం అర్హులను గుర్తిస్తారని చెప్పారు. దారిద్య్ర రేఖకు దిగువన ఉండి, 40 శాతం అంగవైకల్యం గల వారు సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, రెండు ఫొటోలతో శిబిరానికి హాజరు కావాలని తెలిపారు. ఎంపిక చేసిన వారికి పరికరాలు ఎప్పుడు ఇచ్చేది నిర్వాహకులు తెలియజేస్తారని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో లవరాజు కోరారు.

లక్ష్మీపురం సర్పంచ్‌గా జగదీశ్వరరావు బాధ్యతల స్వీకరణ

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా లచ్చుభుక్త జగదీశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల విడుదలైన పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో భాగంగా జగదీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, గ్రామపెద్దలు, నాయకులు గాడు తాతినాయుడు, కరుభుక్త అప్పలరాజు, మొకర పైడినాయుడు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, గుడ్డాల ఎల్లయ్య, కరుభుక్త అప్పలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగివలస ప్రీమియర్ లీగ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంగివలస బ్యాంకాక్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం నుంచి శ్రీపోలమాంబ సంగివలస ప్రీమియర్ లీగ్ జరగనుంది. విన్నర్ జట్టుకు రూ.50వేలు, రన్నర్ జట్టుకు రూ.30వేలు ప్రైజ్ మనీ అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. ‘మ్యాన్ ఆఫ్ ది సిరీస్’ కు రూ.3వేలు, ‘మ్యాన్ ఆఫ్ ది ఫైనల్ మ్యాచ్’ కు రూ.2వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు రూ.2వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.2వేలు వంతున నగదు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు.

సెల్లార్‌లో నిర్మాణాల తొలగింపు



నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ప్రధాన రహదారి వెంబడి ఉన్న వ్యాపార సముదాయాల్లో, అపార్ట్‌మెంట్ల సెల్లార్లలో ఏర్పాటు చేసిన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కొరడా ఝుళిపించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా సెల్లార్లలో ఎటువంటి నిర్మాణాలు ఉండకూడదన్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఇక్కడ అనధికార నిర్మాణాలను తొలగించినట్లు సీపీఎస్ ఝాన్సీ తెలిపారు. ఇక్కడ మొత్తం ఆరు భవన సముదాయాల సెల్లార్లలో ఉన్న అనధికారిక కట్టడాలను పూర్తి స్థాయిలో తొలగించినట్లు తెలియజేశారు. మరిన్ని నిర్మాణాలు త్వరలో తొలగించేందుకు ఇప్పటికే నోటీసులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తరుణ్, భరత్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో జానపద, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. నగరంలోని నాట్యతరంగిణి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంట్

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేటలో బంగారమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన మొదటి మూడు జట్లకు వరుసగా రూ.12వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేసి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.